
# ఆధ్యాత్మిక శాస్త్రం

-బ్రహ్మర్షి పత్రీజీ



# “ఆధ్యాత్మిక శాస్త్రం!”

ఈ రోజు మనం ఆధ్యాత్మిక శాస్త్రం గురించి విశేషంగా తెలుసుకుందాం. ఆధ్యాత్మిక శాస్త్రాన్ని “స్పిరిచ్యువల్ సైన్స్” అంటారు.

మిత్రులారా...! ప్రతి ఒక్కరూ విధిగా, తప్పనిసరిగా ముందుగా తెలుసుకోవలసిన శాస్త్రమే, అధ్యయనం చేయవలసిన శాస్త్రమే “ఆధ్యాత్మిక శాస్త్రం”!

ఈ ఆధ్యాత్మిక శాస్త్రం అన్నది ఆరు సత్యాలతో.... ఆరు సిద్ధాంతాలతో ... విరాజిల్లుతోంది.

ఈ ఆరు సత్యాలు, ఈ ఆరు సిద్ధాంతాలు, ఈ ఆరు ప్రతిపాదనలు మనం క్షుణ్ణంగా, విపులంగా, విశేషంగా ఈ రోజు మనం తెలుసుకుందాం. ఈ ఆరింటినీ వెరసి “ఆధ్యాత్మిక శాస్త్రం”గా మనం అర్థం చేసుకుందాం.

ఏదైతే మనకు అర్థం అవుతుందో, వెంటనే అది మన చేత జీవింపబడుతుంది! దేనినైతే మనం అర్థం చేసుకుంటామో, దేనినైతే మనం అవగాహన చేసుకుంటామో దానినే మనం జీవిస్తాం! ఏదైతే మన అవగాహనకు రాదో, మన వల్ల అర్థం కాబడదో దానిని మనం జీవించలేం కదా? అర్థం చేసుకుంటే, అవగాహన కలిగి వుంటే, మెదడుకు అది ఎక్కితే ... మన జీవితంలో దాని ఆచరణ తనంతటతాను, సహజంగా వచ్చేస్తుంది.

మై డియర్ ఫ్రెండ్స్! “మనిషి అంటే ఏమిటి? ఎవరు? ఈ జీవితం ఏమిటి? ఎందుకు ‘ఇలా’ జీవిస్తున్నారు? ఎందుకు ‘అలా’ జీవిచడం లేదు? అసలు ‘ఎలా’ జీవించాలి? అసలు ‘పుట్టుక’ అంటే ఏమిటి? ‘చావు’ అంటే ఏమిటి? పుట్టుక ముందు చనిపోయిన తర్వాత ఏమిటి? అసలు సంపూర్ణంగా జీవితం యొక్క రూపురేఖలు ఏమిటి? ఈ సృష్టి యొక్క రచనా కార్యక్రమం ఎలా జరుగుతోంది? జీవితంలో దుఃఖరహితంగా ఎలా ఉండాలి? ఆనంద సహితంగా ఎలా వుండాలి? అందరూ కలిసి మెలసి ఎలా జీవించాలి?”..... ఇదంతా వెరసి “ఆధ్మాత్మి శాస్త్రం”. వీటన్నింటినీ.... వాటిలో సత్యాలనూ.... మనకు ఆధ్యాత్మిక శాస్త్రం పరిచయం చేస్తుంది!

ఎంత ముఖ్యమో.... ఈ శాస్త్రం! “ఆధ్యాత్మిక శాస్త్రం” తెలియకపోతే గ్రుడ్డెద్దు చేలో పడ్డట్టు!

ఏం చేస్తున్నామో తెలీదు! ఏం చేయాలో తెలీదు! ఏం చెయ్య

బోతున్నామో తెలియదు! ఇంతవరకూ ఏం చేశామో తెలియదు! ఏం తిన్నామో తెలియదు!.... ఏం ఆలోచించాలో తెలియదు! ఏది మాట్లాడాలో తెలియదు! డబ్బు ఎంత సంపాదించాలో తెలియదు! సంసారంతో ఎలా జీవించాలో తెలియదు! మరణానికి ఎలా మనం తయారు కావాలో తెలియదు!

## "గ్రుడ్డెద్దు చేలో పడిన చందం!"

ఆధ్యాత్మిక శాస్త్రం తెలియని వాళ్ళ జీవితాలు గ్రుడ్డి ఎద్దు చేలో పడినట్టు. ఈనాడు ప్రపంచంలో ఎన్ని గ్రుడ్డి ఎద్దులున్నాయో?! గ్రుడ్డి ఎద్దులకు చూపు కలిగించేదే ఆధ్యాత్మిక శాస్త్రం. ఆ గ్రుడ్డి ఎద్దుకు చూపు వచ్చేస్తే..... ఇక చేలో ముళ్ళను తప్పించుకోవచ్చు. గోతులను తప్పించుకోవచ్చు. చక్కగా తన గమ్యాన్ని చూసుకుంటుంది! కళ్ళు ఉన్నాయి కనుక.... ఆ ముళ్ళ చేలోపడి తనను తాను బాధించుకోదు. చక్కగా చేలు దాటుతుంది.... ఇక గ్రుడ్డి ఎద్దు కాదు గనుక.

మానవాళి అంతా గ్రుడ్డి ఎద్దు చందాన వుంది! ఆధ్యాత్మిక శాస్త్రం తెలియదు. వాటిలో సత్యాలు తెలియవు. ఆ సిద్ధాంతాలు తెలియవు. "ప్రక్కవాడు కారు కొంటే నేనూ కారు కొనాలి" , "ప్రక్కవాడు మంచి బట్టలు వేసుకుంటే నేను ఇంకా రెండు మంచి బట్టలు వేసుకోవాలి", "ప్రక్కవాడికి ఒక పెళ్ళాం వుంటే నాకు ఇద్దరు పెళ్ళాలు వుండాలి", "ప్రక్కవాడు ఒక మేడ కడితే నేను ఇంకా పెద్ద మేడ కట్టాలి".

అంతేకానీ "ప్రక్కవాడు వివేకానందుడు అయ్యాడే నేను వివేకానందుడిలా కావాలి" అని మాత్రం ఉండదు......!

"ఒకానొక అతను జీసస్ క్రైస్ట్ అయ్యాడే.... మరి నేను కూడా జీసస్ క్రైస్ట్ కావాలి" అని మాత్రం ఉండదే.......?

## అందరూ సైంటిస్టులే!

మైడియర్ ఫ్రెండ్స్...! ఓ జీసస్ క్రైస్ట్ గానీ, ఓ వివేకానందుడు గానీ, ఓ గౌతమ బుద్ధుడు గానీ, ఓ వర్థమాన మహావీరుడు గానీ, ఓ కృష్ణుడు గానీ, ఓ వేదవ్యాసుడు గానీ, ఓ వాల్మీకి గానీ, ఓ జొరాస్టర్ గానీ, ఓ వీరబ్రహ్మేంద్రస్వామి గానీ, ఓ కబీర్ గానీ, ఓ నానక్ గానీ, ఓ మహావతార్ బాబాజీ గానీ, ఓ యుక్తేశ్వర్ గిరి గానీ, ఓ యోగానంద పరమహంస గానీ.... మైడియర్ ఫ్రెండ్స్ ... వీరందరూ కూడానూ ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులు! స్పిరిచ్యువల్ సైంటిస్టులే వీరందరూ!

ఎవరెవరికైతే మనం దేవాలయాలు కట్టి, చర్చ్‌లు కట్టి, మందిరాలు

కట్టి పూజిస్తున్నామో... "వాళ్ళెవరయ్యా?" అంటే.... "వాళ్ళు తమ తమ జీవితాల్లో ఏం సాధించారూ?" అంటే... వారు ఆధ్యాత్మిక శాస్త్రాన్ని ఔపోసన పట్టినవాళ్ళు! వారు ఔపోసన పట్టి తెలుసుకున్నది కేవలం 'ఆధ్మాత్మిక శాస్త్రమే'!

## "ఒక్కటే శాస్త్రం!"

అయితే, 'రకరకాల' ఆధ్యాత్మిక శాస్త్రాలు లేవు మిత్రులారా...! ఉన్నది ఒక్కటే 'స్పిరిచ్యువల్ సైన్స్', 'ఆధ్యాత్మిక శాస్త్రం!'

ఆ ఆధ్యాత్మిక శాస్త్రాన్ని.... ఉన్న ఒక్కగానొక్క ఆధ్యాత్మిక శాస్త్రాన్ని'..... స్పిరిచ్యువల్ సైన్స్‌ను... ప్రజలందరికీ సుపరిచయం చేయడం కోసమే.... సువిదితం చేయడం కోసమే.... "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్" స్థాపించడం జరిగింది....! లక్షలాది మంది.... లక్షలాది జనులు.... మైడియర్ ఫ్రెండ్స్... విశాల హృదయంతో ఆధ్యాత్మిక శాస్త్ర విద్యను నేర్చుకోవడం వల్ల తమ తమ జీవితాల్ని మూడు పువ్వులూ ఆరు కాయలుగా చేసుకున్నారు!.... చేసుకుంటున్నారు!

మనం కూడా వివేకానంద స్వామిలా కావలె! గౌతమబుద్ధుడిలా కావలె! వర్ధమాన మహావీరుడిలా కావలె! ఇదంతా వాస్తవానికి చాలా...చాలా...సులభం! కేవలం ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క రూపురేఖలు తెలుసుకొనవలె! కేవలం ఆత్మ శాస్త్రాన్ని అర్థం చేసుకొనవలె! అప్పుడు, ఆ రకంగా, సహజంగానే జీవిస్తాం. ప్రతి ఒక్కరూ కూడానూ ఆధ్మాత్మిక శాస్త్రజ్ఞులు అయిపోతాం. ఇది ఆశ్చర్యకరమైన విషయం ఎంత మాత్రం కాదు!

## "సన్యాసం పుచ్చుకోకూడదు!"

ఆధ్మాతిక శాస్త్ర విశారదులు కావడానికి ఏ హిమాలయాలకూ పోనక్కరలేదు! పెళ్ళాం, బిడ్డలు వదిలి పెట్టేసి సన్యాసం పుచ్చుకోనక్కరలేదు! అసలు సన్యాసం పుచ్చుకోకూడదు. హాయిగా... మనం చేస్తున్న వ్యవసాయం....,వ్యాపారం........, ఉద్యోగం........, ఏది చేస్తూంటే అది... చేస్తూనే వుండాలి! వదిలి పెట్టవలసింది వ్యవసాయం కాదు; 'పెళ్ళాం', 'బిడ్డలు' కాదు; 'గృహస్థాశ్రమం' కాదు, 'డబ్బు సంపాదన' కాదు... ఇవన్నీ కాదు, వదిలి పెట్టవలసినవి! వదిలిపెట్టవలసినది జీవితశాస్త్రం పట్ల మన అజ్ఞానాన్ని! ఆధ్యాత్మిక శాస్త్ర సుపరిచయలేమి వుంది మనకు. ఆ 'లేమి' వదిలి పెట్టాలి! 'ఆధ్మాత్మిక శాస్త్రాన్ని' పరిచయం చేసుకోవాలి. అంతే! అంతకన్నా ఇంకేం లేదు మిత్రులారా....!

ఆధ్మాత్మిక శాస్త్రం.... ఆరు సత్యాలతో అలరారి వుంది. ఆరు సత్యాలు,

ఆరు సిద్ధాంతాలు, ఆరు అవగాహనలు..... మైడియర్ ఫ్రెండ్స్...!

1. ఆత్మ సిద్ధాంతం 2. పునర్జన్మ సిద్ధాంతం 3. కర్మసిద్ధాంతం 4. పురోగమన సిద్ధాంతం 5. యోగ సిద్ధాంతం 6. అనేకానేక సిద్ధాంతం!

ఆరు సత్యాలు, ఆరు సిద్ధాంతాలు, ఆరు ప్రతి పాదనలు, ఆరు అవగాహనలు!

## "ఆత్మ సత్యం!"

మొట్టమొదటి అవగాహన... మనం శరీరం కాదు ఆత్మ పదార్థం! ఉన్నదల్లా ఆత్మ చైతన్యమే! 'సర్వం ఖల్విదం బ్రహ్మ!' ఈ ఉన్నదంతా ఆత్మ పదార్థమే. అయం ఆత్మా బ్రహ్మ! "నేను" ... అన్నది ఈ 'ఆత్మ" అన్నది... ఇదే సర్వత్రా వున్న బ్రహ్మ పదార్థం!

"తత్వమసి! నువ్వు కూడా 'అదే' నాయనా!! నువ్వు ఈ తలకాయ, ఈ మొండెం, ఈ చేతులు, ఈ కాళ్ళు.... అనుకుంటున్నావేమో... కాదు సుమా! నువ్వు ఆత్మ పదార్థం! సర్వత్రా వున్న ఆత్మ పదార్థమే అక్కడా వుంది, ఇక్కడా వుంది... ఎక్కడైనా వుంది! 'నేను' అదే ... 'నువ్వు' అదే...!" చూశారా... ఇది ప్రధమ సత్యం! ఇక్కడి నుంచి మొదలౌతుంది 'ఆధ్యాత్మిక శాస్త్రం.'

ఎలాగైతే ఒక రాయి నుంచి ఒక శిల్పం మొదలౌతుందో, ఆ రాయి చెక్కగా... చెక్కగా... చెక్కగా... చక్కటి శిల్పం అవుతుందో... ఆ 'శిల్పం' యొక్క 'ఆది'... ఆ రాయిలో వుంది. అలాగే మన జీవితం యొక్క 'ఆది' ఆత్మ పదార్థం! మనము ఆ 'ఆత్మ పదార్థం!' ఆ శిల్పం కూడా మొట్ట మొదట రాయే! కళ్ళు, ముక్కు, కాళ్ళు, చెవులూ లేని రాయి. తర్వాత అన్ని అవయవాలూ, రూపురేఖలూ విస్తారంగా వచ్చాయి, మిత్రులారా...! అలాగే మొట్టమొదట ముందుగా వున్నది ఆత్మ పదార్థం!

ఒక స్క్రీన్ మీద సినిమా వచ్చినట్టు, సినిమా వేసి ఫోకస్ చేసినట్టు...! అంతకుముందు అక్కడ స్క్రీన్ వుంది. ఆ సినిమా తీసేసినప్పడు మనకు స్క్రీన్ కనబడుతుంది. సినిమా వేసినప్పడు మనకు స్క్రీన్ కనబడదు. అక్కడ చిరంజీవి కనపడతాడు. ... అక్కినేని నాగార్జున కనపడతాడు... కనుక మైడియర్ ఫ్రెండ్స్... ఉన్నది అక్కడ ఆ యొక్క స్క్రీన్, ఆ స్క్రీన్ పేరే ఆత్మ పదార్థం, మనమంతా ఆత్మ పదార్థం! చూశారా...! ఇదే ఆత్మ సిద్ధాంతం, ఆత్మ సత్యం, ఆత్మ ప్రతిపాదన, ఆత్మ అవగాహన!

చెట్టుంది... కానీ ఆ చెట్టు తర్వాత వచ్చింది, ఆత్మ వుంది ముందు, అక్కడ! ఆ తర్వాత దాని మీదకు చెట్టు వచ్చింది. స్క్రీన్ మీద చిరంజీవి

వచ్చినట్టు, స్క్రీన్ మీద అక్కినేని నాగార్జున వచ్చినట్టు, స్క్రీన్ మీద చెట్టు వచ్చింది. స్క్రీన్ మీద ఈ శరీరం వచ్చింది!

మనం ఆత్మ పదార్థం.... అది మొట్టమొదటి అవగాహన ఆధ్యాత్మిక శాస్త్రంలో....! "అయం ఆత్మా" .... "అహం బ్రహ్మాస్మి ".... "తత్త్వమసి శ్వేతకేతో".

## "పునర్జన్మ సత్యం!"

ఆ సూర్యుడు, ఆ చంద్రుడు, ఆ నక్షత్రాలు, గాలి, నీరు, చెట్లు, చేమలు, జంతువులు, అంతా కూడా ఆత్మపదార్థం! సర్వత్రా వ్యాపించింది ఆత్మపదార్థం.

ఆత్మపదార్థం అన్నది ఆత్మబిందువులుగా ఏర్పడి... ఒక్కొక్క బిందువూ రెండవ సత్యంలోకి ప్రవేశిస్తుంది. పునర్జన్మ చక్రంలోనికి ప్రవేశిస్తుంది...తన స్వంత ఆత్మ లోకాలను వీడి!

ఈ యొక్క భూః, భువర్, సువర్, జనా, మహో, తపో, సత్య.... రకరకాల లోకాలు అన్నవి సృష్టి యొక్క రచన! మూలచైతన్యం నుంచి ఎన్నో ఆత్మలు వచ్చాయి! బ్రహ్మాత్మ నుంచి ఎన్నో బ్రహ్మాండాలు వచ్చాయి! ప్రతి ఆత్మ, ఆత్మ పదార్థంగానూ, ఆత్మ బిందువు గానూ, ఈ యొక్క సకల లోకాలలో అనేకానేక అనుభవాలు పొందుతూ... తన్ను తాను తెలుసు కుంటూ, తన్ను తాను అభివృద్ధి పరుచుకుంటూ , ప్రతి లోకంలోనూ జన్మ తీసుకుంటూ వుంది. ఈ యొక్క జన్మ క్రమాన్నే "పునర్మజన్మ సిద్ధాంతం" అంటాం.

ఇప్పుడు నేను హైదరాబాద్‌లో వున్నాను, రేపు చెన్నై వెళ్తాను, ఆ తర్వాత ముంబాయి వెళ్తాను, ఆ తర్వాత భోపాల్ వెళ్తాను, ఢిల్లీ వెళ్తాను. అంటే ఏంటి...? ఈ 'హైదరాబాద్' అనేది ఒక లోకం; చెన్నై అనేది ఇంకొక లోకం; 'ముంబై' అనేది మరొక లోకం! ఆత్మ అన్నది అనేక లోకాలు తిరుగుతూ వుంటుంది. భూలోకం, భువర్లోకం, సువర్లోకం..... ఇలా ఎన్నో లోకాలు, కోటానుకోట్ల లోకాలు...!

మిత్రులారా! హైదరాబాద్ వదిలి పెడితే కానీ చెన్నై పోలేం... ఇక్కడ చచ్చి చెన్నైలో పుడతాం. చెన్నైలో చచ్చి ముంబైలో పుడతాం.

ఈ యొక్క శరీరంలోకి ఈ ఆత్మపదార్థం వచ్చింది. ఇప్పడీ శరీరం వుంది, కొన్ని రోజులకు ఈ శరీరం పోతుంది. అప్పడు ఆత్మ బయటకు వచ్చి వేరే శరీరంతో, వేరే లోకంలో విరాజిల్లుతుంది. మళ్ళీ ఇంకో శరీరంలోకి వస్తుంది..

## “అనేకానేక ఆటలు!”

ఈ యొక్క ఆత్మ ఒకసారి మానవ శరీరంలో ప్రవేశించిన తరువాత ఇక అనేక మానవ శరీరాలు తీసుకుంటుంది! అంతా తన విలాసం కోసం, తన ఉల్లాసం కోసం.... ఆటలాడడానికి....! ఒక జన్మలో క్రికెట్ ఆడటానికి...! ఒక జన్మలో హాకీ ఆడటానికి...! ఒక జన్మలో ఫుట్‌బాల్ ఆడటానికి...! ఒక జన్మలో బాస్కెట్‌బాల్ ఆడటానికి....! ఒక జన్మలో పేకాట ఆడటానికి...! ఒక జన్మలో పెళ్ళి చేసుకుని గంపెడు పిల్లల్ని కనడానికి! ఇంకొక జన్మలో పెళ్ళి చేసుకోకుండా సన్యాసిగా వుండడానికి...! ఒక జన్మలో బీదవాడిగా... మరో జన్మలో జమీందారుగా...! ఒక జన్మలో వ్యవసాయం చెయ్యటానికి... ఇంకో జన్మలో వ్యాపారం చెయ్యడానికి! ఒక జన్మలో రాజకీయం చెయ్యడానికి... ఇంకో జన్మలో భట్రాజుగా వుండటానికి...! వెరసి రకరకాల పాత్రలు...! ప్రతి పాత్ర కూడా విశిష్టమైనది! ‘రాజు’ పాత్ర అన్నది ‘భట్రాజు’ పాత్ర కన్నా ఎక్కువ విశిష్టమైనదేం కాదు! భట్రాజు పాత్ర అన్నది రాజు పాత్ర కన్నా తక్కువేం కాదు!

ఇలా ఆత్మ అన్నది అనేక జన్మల్లో, అనేక నాటకాలు వేస్తూ, ప్రతి నాటకం నుంచీ తన మనోరంజాన్ని కల్పించుకుంటూ, నూతన ప్రయోగాలకు సంకల్పాలు చేస్తూ, నూతన అనుభవాలతో నూతన పాఠాలను నేర్చుకుంటూ, తన పరిమిత బుద్ధిని అపరిమితం చేసుకుంటూ వుంటుంది. దీన్ని “పునర్జన్మ సిద్ధాంతం” అంటాం.

గుర్తుంచుకుందాం... ప్రస్తుతం... ఈ ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క రూపురేఖలను తెలుసుకుంటున్నాం! ఆరు సిద్ధాంతాలలో, ఆరు అవగాహనలతో, ఆరు సత్యాలతో, ఆరు ప్రతిపాదనలతో విరాజిల్లి వుంటుంది... ఈ యొక్క ఆధ్యాత్మికశాస్త్రం...!

మొట్టమొదటిది మనమంతా ఆత్మపదార్థం.... చైతన్య పదార్థం, శుద్ధ చైతన్య పదార్థం.... చూశారా! రెండవది ఈ చైతన్య పదార్థం అనేకానేక శరీరాలు ధరిస్తుంది!

ఇప్పడీ బట్టలు ధరించాం కదా, కాస్సేపటి తర్వాత వేరే బట్టలు వేసుకుంటాం కదా....!కలర్స్ కలర్స్ బట్టలు వేసుకుంటాం.... వైట్, బ్లూ... రకరకాల చొక్కాలు వేసుకుంటూంటాం..... బరువైనవి, తేలికైనవి... ఇలా ఎన్నో రకాల చొక్కాలు వేస్తూంటాం. అలాగే మన శరీరం కూడా ఒక చొక్కా...! చూశారా! అంటే, ఈ ఆత్మ పదార్థం కూడా అనేక శరీరాలు వేసుకుంటూవుంటుంది.

అయితే మానవ జన్మ తీసుకున్న తర్వాత రకరకాల పరిస్థితులను తీసుకుంటుంది. అంతవరకు శరీరాలన్నీ వేరు వేరు! కుందేలు శరీరం వేరే, ఏనుగు శరీరం వేరే... అప్పటి దాకా రకరకాల శరీరాలు మారుస్తూంటుంది. మానవుడిగా పుట్టిన తరువాత శరీరం ఒక్కటే... అయితే రకరకాలుగా పరిస్థితులను మారుస్తుంటుంది.

ఒకానొక కుందేలు జీవితంలో, ఒకానొక ఏనుగు జీవితంలో పరిస్థితులు అంత ఎక్కువగా వేరు వేరుగా వుండవు! చాలా కొద్ది వాతావరణ తేడాలు వుంటాయి. కానీ, మానవ జీవితంలో .... మానసిక స్థితులను బట్టి... ఎన్ని విశేషాలు వుంటాయో....! మానవ జీవిత పరిస్థితులు ఎన్నో, ఎన్నెన్నో...!

ప్రతి యొక్క జీవిత పరిస్థితినీ జీవించడం కోసం, అందులో తరించడం కోసం, అందులో పూర్ణజ్ఞానాన్ని కలిగించుకోవడం కోసం ... ఇదంతా ఆత్మ యొక్క రంజనం...! ఒక్కొక్క జన్మ ఒక్కొక్క రంజనం కోసం తీసుకుంటుంది ఆత్మ! చిరంజీవిగారు ఎన్ని సినిమాలు చేశారు! "మళ్ళీ ఇంకొక పాత్ర ఏమిటీ? ఇంకొక సినిమా ఏమిటీ?" అని ఆయన బాధపడతా రా, లేక "అహా! ఇంకో సినిమా!" అని సంతోషిస్తారా...? సంతోషిస్తారు... ఇంత వయస్సు వచ్చినా ఇంకా పాత్రలు వేస్తూనే వున్నారు...! అదీ ఆత్మ పరిస్థితి, ఎన్ని జన్మలైనా తీసుకుంటూనే వుంటుంది... ఆత్మ తన యొక్క రంజనం కోసం, తన యొక్క ప్రగతి కోసం...! చూశారా! దీన్ని "పునర్జన్మ సిద్ధాంతం" అంటాం. ఇదే రెండవ సిద్ధాంతం, ఇదే రెండవ సత్యం! ఇదే రెండవ అవగాహన!

## "కర్మ, కర్మ ఫల సత్యం!"

మొట్టమొదటిది ఆత్మ సిద్ధాతం, రెండవది పునర్జన్మ సిద్ధాంతం, మూడవది కర్మ సిద్ధాంతం!

ప్రతి జన్మలోనూ కర్మలు చేయాలి! కర్మలు చేయకుండా ఆత్మమన జాలదు... ఒక్క క్షణం అయినా! రాజుగా వుంటే రాజు కర్మలు... వ్యవసాయ దారుడిగా వుంటే కర్షకుడి యొక్క కర్మలు.. ఆడగా వుంటే ఆడకర్మలు.... మగగా వుంటే మగ కర్మలు... ఇలాగ! ఈ యొక్క రకరకాల కర్మలు... శరీర పోషణ కోసం, శరీరం నిలపటం కోసం, జీవితం కోసం, పేరు ప్రతిష్టల కోసం, ప్రగతి కోసం, విద్య కోసం... ఎన్నో పనులు చేస్తాం... ఈ ప్రతి పనీ కూడానూ ఒకానొక కర్మ..!

ప్రతి కర్మకూ , దాని యొక్క ఫలం వుంటుంది. దాని యొక్క

రూపాంతరం వుంటుంది.  అంటే నేను బాగా చదివాననుకోండి, బాగా పాసవుతాను, బాగా పాసయితే మంచి వుద్యోగం వస్తుంది.  మంచి ఉద్యోగం వస్తే మంచి డబ్బు వస్తుంది.  మంచి పెళ్ళాం వస్తుంది.  చదవక పోతే పాస్ కాను, ఉద్యోగం రాదు,.... ఉద్యోగం రాకపోతే పెళ్ళి కాదు చూశారా...!

ఒక దాని యొక్క ఫలం మరొక దానికి దారి తీస్తుంది. బాగా దున్నితే విత్తనం మొలకెత్తుతుంది. కలుపు తీస్తే పంట బాగా వస్తుంది. కలుపు తీయకపోతే అంకురం విస్తరించదు.  నీళ్ళు బాగా పెడితే పంట బాగా పండుతుంది.  నీళ్ళు పెట్టకపోతే, కలుపు తీయకపోతే, పంట ఎలా వుండాలో అలా వుంటుంది. అంటే ప్రతి కర్మకూ దాని ఫలం, దాని పర్యవసానం!.... కార్యమూ... కారణమూ! మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది;  పాపపు పనులు, చెడు పనులు చేస్తే పాపం వస్తుంది.  పాపం వల్ల రోగాలూ, బాధలూ, పుణ్యం వల్ల సుఖాలూ, భోగాలూ పరంపరగా అనుభవిస్తాం!  ఇదంతా కర్మ సిద్ధాంతం...! కార్య కారణ సత్యం...!

**"శరీరం ఎక్కడ వుంటే మనస్సు అక్కడ!"**

స్కూల్, కాలేజీకెళ్ళి పాఠాలు బాగా విన్నామనుకోండి.... శ్రద్ధగా విన్నామనుకోండి... అవి మనకు బుర్రకెక్కుతాయి.  అక్కడ లెక్చరర్ చెబుతూన్నప్పడు వేరే ఊహాగానాలు చేస్తూంటే... సినిమాల గురించీ, షికార్ల గురించి... లెక్చరర్ చెప్పేది వినపడదు, లోపలికి పోదు.  రేపు మళ్ళీ ఎగ్జామ్ వ్రాస్తున్నప్పడు చిరంజీవి గుర్తుకొస్తాడు గానీ, అక్కడ వ్రాయవలసిన పాఠం... సైన్సో, లెక్కలో... ఏదీ గుర్తు రాదు! ఏం చేస్తాం పాపం... గుండు సున్నా చుడ్తాం!

చిరంజీవి సినిమా చూసేటప్పడు చిరంజీవి సినిమా బాగా చూడాలి.  కానీ పాఠాలు చదువుకుంటున్నప్పడు ... కాలేజీలో, స్కూల్లో ఉన్నప్పడు... సినిమాలు గుర్తు రాకూడదు... ఆపాఠం గుర్తుండాలి! మన శరీరమెక్కడ వుంటే మన మనస్సు అక్కడ ఉండాలి.  వంట చేస్తున్నాం.... ఎక్కడో ఆలోచిస్తూ చేస్తే చెయ్యి కాలుతుంది.  డ్రైవింగ్ చేస్తున్నాం... కారు నడుపుతూ ఎక్కడో ఆలోచన చేస్తే ఏక్సిడెంట్ అవుతుంది.  చచ్చిపోతాం! అయితే శరీరం పోతుంది,  కానీ ఆత్మ చావదు.  ఇంకో శరీరం వస్తుంది. ఒక షర్ట్ చిరిగి పోయిందనుకోండి, ఏమవుతుంది...? క్రొత్త షర్ట్, ఇంకో షర్ట్ వేసుకుంటాం.  ఈ శరీరం కాలిపోయిందనుకోండి, ఇంకో శరీరం వస్తుంది.  ఆత్మ చావదు.  ఏమన్నాడు భగవద్గీతలో వేదవ్యాసులవారు..?

**"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః॥"**

ఆత్మ అన్నది ... "నేను అన్నది... 'ఎరుక' అన్నది... 'చైతన్యం' అన్నది ... 'సెల్ఫ్' అన్నది... శస్త్రాల చేత ఛేదింపబడదు! అగ్నితో దహింపబడదు! ఆత్మ పదార్థం దేని చేతా నశింపబడదు. కానీ శరీరం ఛేధింపబడుతుంది. తడుపబడుతుంది. దహించబడుతుంది. రకరకాల ప్రక్రియలకు లోనవుతుంది. శరీరం మనం కాదని తెలుసుకున్నప్పుడు, ఎంతటి ఆనందమో... చెప్పనలవి కాదు! ఆధ్యాత్మిక సత్యాలు ఒక్కొక్కటీ, ఒక్కొక్కటీ తెలుస్తున్నప్పుడు ఎంతటి ఆనందమో....! నిజంగా ఒక్కొక్క మెట్టూ ఎక్కుతున్నట్టు జీవితంలో....!

"ఓహో... నేనెన్నో జన్మలెత్తానా...? అంతకు ముందు నేను జమీందారునా...? ఇప్పుడు మటుకే నేను బికారినా...? అయితే ఫరవాలేదు!" ... అప్రక్కనున్న జమీందారు ఇక వీడి మీద ప్రభావం చూపించడు!

చూశారా...! గత జన్మల గురించి తెలుసుకున్నప్పుడు, పూర్వ జన్మల గురించి తెలుసుకున్నప్పుడు, పునర్జన్మ సిద్ధాంతం గురించి అవగాహన వచ్చినప్పుడు, దుఃఖాలన్నీ పటాపంచలైపోతాయి!

"నేను శరీరం కాదు ఆత్మను" అని తెలుసుకున్నప్పుడు ... "నేను ఎల్లప్పుడూ ఉండే ఆత్మను! పుట్టనీ, చావనీ... ఆత్మను! శరీరం పుడుతుంది, శరీరం చస్తుంది! ఆత్మ పుట్టదు, చావదు! శరీరం పుట్టనీ, చావనీ... ఆత్మ రకరకాల పుట్టుకలు, రకరకాల చావులూ చూసుకుంటూ వెళ్ళిపోతుంది. సినిమాల్లో నాటకంలా, సినిమాల్లో పాత్రల్లా...!"... ఇది అవగాహన కొచ్చినప్పుడు "నేను అంతా నాటకం; ఇదంతా సినిమా!" ఈ అవగాహనకొచ్చినప్పుడు ఎంత ఆనందంగా వుంటుంది! బాబోయ్ ... చెప్పనలవి కాదు!

## "చెడు చేస్తే చెడు, మంచి చేస్తే మంచి!"

కర్మ సిద్ధాంతం... ద్వారా మనం తెలుసుకోవలసినది ఏమిటంటే మన పాపాల వల్లే మనకు రోగాలొస్తాయి!

చికెన్ తింటాం, మటన్ తింటాం... కడుపు చెడిపోతుంది. డాక్టర్ దగ్గరకు వెళ్తాం. కడుపు కోస్తాడు. హార్ట్ ఎటాక్ వస్తుంది. మన యొక్క పాప కార్యక్రమంతోనే మన శరీరం చెడిపోతుంది.... వెరసి కర్మ సిద్ధాంతం!

నోరు బాగుంటే ఊరు బాగుంటుంది! నోరు బాగోలేందంటే ఊరు బాగోదు! సమస్యే లేదు... నోటితో అందరిని చంపితే ఊరు నిన్ను చంపుతుంది. నోరు బాగుంటే ఊరంతా బాగుంటుంది... వెరసి కర్మ సిద్ధాంతం!

నువ్వు ఎలాంటి మాటను విత్తుతావో, అట్లాంటి పరిణామాన్నే నువ్వు కోసుకుంటావు. నువ్వు ఎలాంటి కర్మలు చేస్తావో... నీయొక్క వాక్కులు, నీ యొక్క కర్మలు, నీ యొక్క ఆలోచనలు ఎలా వుంటాయో... నీ వాస్తవం అలా వుంటుంది... వెరసి కర్మ సిద్ధాంతం!

ఇది తెలుసుకున్నప్పడు .... ఇక జాగ్రత్తగా మాట్లాడతాం; పిచ్చి పిచ్చిగా మాట్లాడం! అనవసరంగా కోడినీ, మేకనూ, చేపల్ని చంపం! చంపితే మనం నరకాన్ని అనుభవించాల్సి వస్తుంది! తెలుసుకోండి మై డియర్ ఫ్రెండ్స్...! కర్మసిద్ధాంతాన్ని తెలుసుకున్నవాడు... హింసకు దూరంగా వుంటాడు! పునర్జన్మ సిద్దాంతాన్ని తెలుసుకున్న వాడు ... పరిస్థితులకు ఆవల వుంటాడు!

## "నాలుగు వందల జన్మలు!"

గుర్తుంచుకుందాం మిత్రులారా...! ఒకానొక ఆత్మ... సగటున... ఒక మూడొందల ఏభై జన్మలు, అన్ని పరిస్థితులనూ అవగాహన చేసుకోవడం కోసం... అన్ని కర్మలనూ చేయడం కోసం, అన్ని ఫలాలనూ పొందడం కోసం... ఒకానొక సగటు ఆత్మ... 350 నుండి 400 వరకు సుమారుగా జన్మలు తీసుకుంటుంది.

శైశవాత్మగా కొన్ని జన్మలు, కొంచెం ఎదిగి బాలాత్మగా, మరి కొంచెం ఎదిగి యవ్వనాత్మగా, ఇంకొంచెం ఎదిగి ఫ్రౌడాత్మగా, చివరిగా వృద్ధాత్మగా....! ఎలాగైతే మానవ శారీరక స్థితుల్లో కూడానూ శైశవ స్థితి, బాల్య స్థితి, యవ్వన స్థితి, ఫ్రౌడ స్థితి, వృద్ధాప్య స్థితి అన్నవి వున్నాయో ఆత్మకు కూడానూ కొన్ని జన్మలు ప్రపధమంగా శైశవాత్మగా, తరువాత బాలాత్మగా, తరువాత యవ్వనాత్మగా, ప్రౌఢాత్మగా, చిట్టచివరికి వృద్ధాత్మగా పుట్టి తన జన్మ చక్రాన్ని పరిసమాప్తం చేసుకుంటుంది.

జన్మకర్మ చక్రాన్ని పరిసమాప్తం చేసుకున్న కొన్ని ఆత్మలు... కొన్ని విముక్తాత్మలు... వీళ్ళందరికీ జ్ఞాన బోధ, ఆత్మ బోధ,ధ్యాన బోధ కల్గించడం కోసం, కొన్ని, మళ్ళీ భూలోకంలోకి వస్తాయి. కొన్ని పరిపూర్ణాత్మలు, పూర్ణాత్మలు కూడా అప్పడప్పడు భూమ్మీదికి వస్తాయి. ఇదీ ఆత్మ యొక్క యదార్ధ గాథ! అనేకానేక జన్మల కథ! చూశారా...!

చిరంజీవి... ఇంట్లో వుంటాడు. కానీ స్టూడియో కెళ్ళి ఎన్నో సినిమాలు చేస్తాడు. అక్కినేని నాగార్జున...ఇంట్లో ఉంటాడు. స్టూడియో కెళ్ళి ఎన్నో సినిమాలు చేస్తాడు. ఈ భూమండలం అంతా ఒక స్టూడియో! మనం పై లోకాల్లో ఈ భూమి అనే నాటకరంగం మీదకు వచ్చిన నటులం.

షేక్‌స్పియర్ అన్నాడు:" The whole world is a stage. We are all mere actors. We strut and fume... do our part and depart!"

మైడియర్ ఫ్రెండ్స్! చక్కటి కర్మలు చేద్దాం.... చక్కటి ఫలాలు పొందుదాం! సుకర్మలు... సుఫలాలు! దుష్కర్మలు...దుష్ఫలాలు!

## "మనం శరీరం కాదు, ఆత్మ!"

మనం శరీరం కాదు ఆత్మ! సర్వత్రా ఉండేది ఆత్మ! ఎల్లప్పుడూ ఉండేది ఆత్మ! ఒకానొక ఆత్మ బిందువు అనేకానేక జన్మలు తీసుకుంటూ ఉంటుంది. మానవ జన్మగా వచ్చిన తర్వాత సుమారుగా 350 నుంచి 400 వరకు జన్మలు తీసుకుంటుంది. ప్రతి జన్మలోనూ, వివిధ రకాలైన కర్మలు చేస్తూ, వాటికి తగ్గ ఫలాలు పొందుతూ మళ్ళీ మళ్ళీ జన్మ పరంపరలో వస్తూ, తుదకు ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అధ్యయనం చేసి తనను తాను తెలుసుకుంటుంది.

ప్రతి ఆత్మ కూడానూ సకల వైవిధ్యభరితమైన పాత్రలనూ ధరిస్తుంది. ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క జన్మ.

ఏ జన్మలోనైనా రకరకాల కర్మలు చేయొచ్చు! ఒక జమీందారుగా పుట్టి చెడు కర్మలు చేయొచ్చు; లేదా జమీందారుగా పుట్టి మంచి కర్మలు చెయొచ్చు. ఒక రాజుగా పుట్టి, మళ్ళీ దాన్ని వదిలిపెట్టేసి, ఓ గొప్ప బుద్ధుడయ్యాడు, సిద్ధార్థుడు. అంటే ఎలాగైనా వెయ్యవచ్చు... వేషాన్ని! వేషం వేసినప్పుడు ఎలాగైనా వెయ్యవచ్చు! నటన అన్నది సీరియస్‌గా చెయ్యవచ్చు... హాస్యంగా చెయ్యవచ్చు... మధ్య రకంగా చెయ్యవచ్చు! రకరకాలుగా ఉంటాయి వేషాలు. ప్రతి ఆత్మ కూడానూ తన తన కర్మలను రకరకాలుగా చేస్తూంటుంది "ఇలా' కర్మ చేస్తే ఫలితం 'ఎలా' వుంటుంది? 'ఇలా' డైలాగులు చెప్తే 'ఎలా' ఉంటుంది? ప్రజలెలా ఆనందిస్తారు?" .... ఈ విధంగా రకరకాలుగా... ఆత్మ తన శక్తి పరీక్షించుకుంటోంది, ప్రతి జన్మలోనూ!

## "పురోగమన సత్యం!"

అయితే ప్రతి జన్మ కూడానూ పురోగమనమే...! ఏ జన్మ కూడానూ, 'తిరోగమనం' కాదు. "ఏ కర్మ కూడానూ తిరోగమనం కాదు" అని తెలుసుకోవడమే నాలుగవ సిద్ధాంతం! నాలుగవ సత్యం! నాలుగవ ఆధ్యాత్మిక సిద్ధాంతమే పురోగమన సిద్ధాంతం! నాలుగవ ఆధ్యాత్మిక సత్యమే పురోగమన సత్యం!

నేను పరీక్ష వ్రాశాను. నాకు 'పది' మార్కులొచ్చాయి, అంటే నేను తెలుసుకున్నాను... "నా జ్ఞానం పది మార్కులంత వుంది. ఇంకా తొంభై

మార్కులు తెచ్చుకోవాలి" అని .... మరి ఆ జ్ఞానం వచ్చింది కదా...!

'ముప్లై' మార్కులొస్తే పాసవుతాం. 'పది' మార్కులొచ్చి ఫెయిలయి పోయాను. నేను ఇప్పుడు 'ఫెయిల్ అయినట్టా? 'పాస్' అయినట్టా? అంతకు ముందు నాకేమీ తెలియదు, కానీ ఇప్పుడు, 'పది' మార్కులొచ్చాయి. అంటే పురోగమనం చెందినట్టే కదా...! మనం ఫెయిలయి పోయామనుకుంటాం. ఫెయిల్ అన్నది లేనే లేదు! ఆత్మ ప్రతి జన్మలోనూ పురోగమనమే చెందు తుంది. ప్రతి పరీక్షలోనూ మనం కొంత కాకపోతే కొంత తప్పనిసరిగా నేర్చుకుంటాం!

నేర్చుకోకుండా మనం ఎప్పుడూ ఉండం... ఏదో ఒకటి చెవిలో పడుతోంది కదా! కనుక మిత్రులారా... ఎక్కడా కూడానూ తిరోగమనం అన్నదే లేదు. అంతా పురోగమనమే! ప్రతి అనుభవమూ... కూడానూ ఆత్మకు ఒకానొక క్రొత్త పుట! 'విలన్' అనుభవమూ, 'హీరో' అనుభవమూ ఆత్మకు ఒకానొక క్రొత్త పుట! "ఆత్మ ఎప్పుడూ పురోగమనంలోనే వుంటుంది" అని తెలుసుకోవాలి. తిరోగమనం లేదు, పురోగమనంలో వుంటుంది ఎప్పుడూ... ఏ ఆత్మ అయినా గానీ, ఎక్కడైనా గానీ! తిరోగమనాత్మ అన్నది సృష్టిలో లేనే లేదు!

దీనినే "పురోగమన సిద్ధాంతం" అంటాం. ఇది తెలుసుకున్నప్పుడు హాయిగా ఉంటుంది. అంతకుముందు "నేను నరకంలో పడిపోతానేమో.... వెనక్కి వెళ్ళిపోతానేమో..." అని కుంచించుకుని వుంటాం. "నరకం అసంభవం! ఇది సంభవం కానిది!" అని తెలుసుకున్నప్పుడు, జీవితంలో గిల్టీ కాన్షియస్‌నెస్ పోతుంది. అపరాధ భావన అన్నది పోతుంది. నేర భావన పోతుంది. "అవును..! వాడు ముందర వెళ్తున్నాడు; నేను కొంచెం రెండడుగులు వెనుక వెళ్తున్నాను. అంతేకానీ, పెద్ద ఏమీ అయి పోలేదు!"

**"ఆత్మకు ఎప్పుడూ విజయమే!"**

"కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్... ఓడి పోలేదోయ్...!"

చూశారా...! ఓడిపోలేదు! ఆత్మ ఎప్పుడూ ఓడిపోదు. ఆత్మకు ఎప్పుడూ విజయమే!

ఇంటినుండి ఇక్కడికి వచ్చాం. ట్రాఫిక్ బాగా వుంది... ఆగిపోయాం. "అయ్యో ఆగిపోయామే" అని బాధ కాదు. ఆగిపోయినప్పుడు ఇంకేదో చూస్తాం. రేపటికి కావలసింది అక్కడేదో చూస్తాం. రేపటికి కావలసింది ఏదో తెలుసుకుంటాం. దాన్నుపయోగించుకుని, రేపు ఇంకో దానికి వినియోగించుకుంటాం. దాన్నుపయోగించుకుని, రేపు ఇంకో దానికి

వినియోగించుకుంటాం. అది మనకు ప్రస్తుతం తెలియదు. మనమను కుంటాం. "టైం వేస్తయిపోయింది. నేను ట్రాఫిక్‌లో చిక్కుకుపోయానే. .. నా జీవితం వ్యర్థమయిపోయింది" అనుకుంటాం! ఇది సత్యం కాదు..!

ప్రతీదీ మనకు వుపయోగనపడేదే...! ప్రతి అనుభవమూ మనల్ని ముందుకు తీసుకుని వెళ్ళేదే...! ప్రతీదీ క్రొత్తదనమే, క్రొత్త రుచే, క్రొత్త వాసనే...! ప్రతి పాత్రా ఒకానొక క్రొత్త పాత్రే! ప్రతి నటనా అవకాశమూ నటజీవితంలో ఒకానొక క్రొత్త అవకాశమే! ప్రతి జీవితావకాశమూ ఆత్మకు, ఓ క్రొత్త మహత్ అవకాశమే! ఎప్పుడూ పురోగమనమే. తిరోగమనమన్నది లేనేలేదు! ఎవరికైనా గానీ.... ఇదే పురోగమన సిద్ధాంతం!

You can never go backwards... You can only go forwards. That is the meaning, my dear friends!

పురోగమనం! ఎంత హాయిగా ఉందో చూశారా.. సత్యాన్ని తెలుసుకున్నప్పుడు! లేకపోతే ఏడుస్తూ ఉంటాం ప్రొద్దుగూకులూ...!

"నేను శరీరం" అనుకున్నప్పుడు ఏడుపు...! "ఒకటే జన్మ" అనుకున్నప్పుడు , "నేను పేదవాడిని, వాడు జమీందారుగా వున్నాడు" అని ఏడుపు ....! కర్మ సిద్ధాంతం తెలియదు, ఏడుపు! పురోగమన సిద్ధాంతం తెలియనప్పుడు "నేను తిరోగమనంలో వున్నానేమో" ననుకుని ఏడుపు....! ఒక్కొక్క అవగాహన వచ్చినప్పుడు, ఒక్కొక్క సిద్ధాంతం తెలుసుకున్నప్పుడు, ఒక్కొక్క సత్యాన్ని తెలుసుకున్నప్పుడు, ఒక్కొక్క రెక్క విచ్చుకున్నట్టు, ఆత్మకు అలా హాయిగా వుంటుంది!

## "యోగసత్యం!"

పురోగమన సిద్ధాంతం తరువాత ఏమిటి? ఇక ఈ పురోగమనాన్ని మనం వేగవంతం చేసుకోవాలి! మామూలుగా, ఒకానొక కెమికల్ రియాక్షన్‌లో 'A+B' అన్నది 'C+D' కావడానికి మూడు వందల రోజులు పడుతుందనుకుందాం. ఆ chemicals లో ఒక కాటలిస్ట్ వేశామను కుందాం.... మూడు వందల రోజుల్లో జరిగేది అప్పుడు మూడు రోజుల్లో జరుగుతుంది. అంటే ఏమిటి? కాటలిస్ట్ యొక్క ఆగమనం వలన అది... ఆ రియాక్షన్... వేగవంతమయింది!

మీరు సంగీతం నేర్చుకోవాలి. నాకు సంగీతం వచ్చు. నేను నేర్పితే, మీ సంగీతాధ్యయనం వేగవంతమవుతుంది. లేకపోతే మీరు టి.వి. చూస్తూ, రేడియో చూస్తూ, ప్రక్కన టేప్ రికార్డర్ పెట్టుకుని సాధన చేస్తే, ఎప్పటికి నేర్చుకుంటారు..? నేర్చుకుంటారు! కానీ, ఒక గురువు సహాయం

దొరికిందనుకోండి, మీ యొక్క నేర్చుకోవడం అనేది వేగవంతమవుతుంది... కాటలిస్ట్ లాగా...! కనుక, మన పురోగమనాన్ని , జీవితంలో మన పురోగమనాన్ని... వేగవంతం చేసుకోవడమే యోగ సిద్ధాంతం!

కాలేజీకి, స్కూల్‌కూ తమ పిల్లల్ని తల్లిదండ్రులు ఎందుకు పంపిస్తారు? పాఠాలను వాళ్ళు ఇంట్లో చెప్పచ్చు కదా...! తల్లి, తండ్రి చెప్పచ్చు. కానీ వాళ్ళు పిల్లలను స్కూల్‌కే పంపిస్తారు... పిల్లలు నేర్చుకోవడాన్ని వేగవంతం చెయ్యడానికి చూశారా...! ధ్యానం చేశామనుకోండి.... మన ఆత్మ పురోగమనం వేగవంతం అవుతుంది. అంటే నత్త నడక లాగా వెళ్ళే జీవితం. ఇక ఫ్లైట్‌లో వెళుతుంది. గరుడ సమానంగా వెళ్తాం. నత్తనడక కాస్తా గరుడ గమనమవుతుంది.... ధ్యానం చేస్తే! ఇదే అయిదవ ఆధ్యాత్మిక సిద్ధాంతం.... యోగ సిద్ధాంతం...!

చిన్నప్పుడే భగవద్గీత చదివామనుకుందాం అసలు సంగతి తెలిసిపోతుంది. అప్పుడు మన జీవితం గరుడ గమనమవుతుంది. లేదా నత్తనడక! చిన్నప్పుడే భగవద్గీత చదవాలి. చిన్నప్పుడే ధ్యాన సాధన చెయ్యాలి. చిన్నప్పుడే "నేను శరీరం కాదు, ఆత్మ" అని తెలుసుకోవాలి. ఆధ్యాత్మిక విద్య అన్నది చిన్నప్పుడే నేర్చుకోవాలి.

## A stitch in time saves nine!

జీవితంలో మన పురోగమననాన్ని వేగవంతం చేసుకోవడమే... ఐదవ సిద్ధాంతం, యోగ సిద్ధాంతం.

అసలు ధ్యానంలోనికి వచ్చిన తర్వాతే, యోగం లోనికి వచ్చిన తర్వాతే... ఈ మొదటి నాలుగు సిద్ధాంతాలూ తెలుసుకునేది మానవులు. అంతవరకూ తెలుసుకోలేరు. అంతవరకూ తాను ఆత్మ అయినా, తాను ఆత్మ అని తెలియదు. తాను ఎన్నో జన్మలెత్తినా, జన్మ ఎత్తాడనేది తెలియదు. "తనను నడిపించేది తన కర్మలే" అని తెలుసుకోకుండా ఎవరో దేవుడ్ని మొక్కుకుంటాడు. "పురోగమనం లేదు" అని చెప్పేసి ఏడుస్తూ వుంటాడు.

యోగి అయిన తర్వాత, యోగ సిద్ధాంతంలోకి అడుగిడిన తర్వాత మొట్టమొదటి సారిగా అనుభవ పూర్వకంగా ఇవన్నీ వున్నాయని తెలుసుకుంటాడు మానవుడు. అప్పడే హాయిగా జీవిస్తాడు. అందుకే 'యోగివికా నాయనా!" అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు. "మొట్టమొదటగా నువ్వు యోగివికా... అప్పడే నీకన్నీ తెలుస్తాయి."

**"తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున॥"**

"అర్జునా... యోగివికా...!"

యోగమంటే ధ్యానం! పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు అందరికీ ధ్యానం నేర్పించి వాళ్ళ పురోగమనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు! ధ్యానానికి పూర్వం నత్తనడక, ధ్యానానికి వచ్చిన తరువాత గరుడ గమనం, విహంగమార్గం..! 'హంస' అంటే 'శ్వాస' అన్నది మనల్ని ఆధ్యాత్మిక విహంగ మార్గంలో పయనింపచేస్తుంది!

కనుక, ప్రతి ఒక్కళ్ళూ ధ్యానం చేయాలి. మనస్సును కంట్రోల్ చేసుకుంటే, మనస్సును శూన్యం చేసుకుంటే, శ్వాసానుసంధానం ద్వారా మన శరీరం నుంచి సూక్ష్మశరీరం విడివడి, మన దివ్యచక్షువు ఉత్తేజితమై మనం అన్నీ చూస్తాం. "మనం ఆత్మ" అని తెలుసుకుంటాం. "పునర్జన్మలు వున్నాయి" అని తెలుసుకుంటాం. "కర్మ సిద్ధాంతం సత్యం" అని తెలుసుకుంటాం. "పురోగమన సిద్ధాంతం" అని తెలుసుకుంటాం...!

ఇవన్నీ తెలుసుకుంటాం, ఎలాగ...? యోగి అయినప్పుడు మిత్రులారా...! అందుకే అన్ని చోట్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ స్థాపించబడ్డాయి! అందరినీ యోగులుగా చేయడం కోసమే ఈ పిరమిడ్ మాస్టర్లందరూ పుట్టారు...! వీళ్ళంతా విముక్తాత్మలు! శైశవాత్మ స్థితి దాటి, యువాత్మ స్థితి దాటి, ప్రౌఢాత్మ స్థితి దాటి, వృద్ధాత్మ స్థితి దాటి.... విముక్తాత్మలైపోయిన వాళ్ళు, మళ్ళీ తిరిగి పుట్టి, వీళ్ళందరికీ 'ఆత్మ బోధ', 'జ్ఞాన బోధ', 'ధ్యాన శిక్షణ' ఇవ్వడం కోసం పుట్టినవాళ్ళే... న్యూ ఏజ్ మాస్టర్స్, పిరమిడ్ మాస్టర్స్...!

ఓ సంగీత విద్యను అభ్యసింపజేసే మాస్టర్ ఎలా వుంటాడో, ఓ కెమిస్ట్రీ లెక్చరర్ ఎలా వుంటాడో, క్రికెట్ నేర్పించే కోచ్‌లు ఎలా వుంటారో.... అలానే ధ్యాన విద్య నేర్పించే కోచ్‌లే పిరమిడ్ మాస్టర్స్! ఇది మౌలికమైన విద్య...! దుఃఖం నుండి బయటపడేసే విద్య...! మన శక్తిని చిలువలు పలువలుగా అభివృద్ధి పరుచుకునే విద్య....! శరీరాన్ని అనారోగ్యం నుండి ఆరోగ్యానికి తీసుకొచ్చే విద్య...! మనస్సును అశాంతి వైపు నుండి శాంతి వైపుకు తీసుకొచ్చే విద్య...! బుద్ధి మాంద్యం నుంచి బుద్ధి సూక్ష్మత వైపు తీసుకొచ్చే విద్య...! ఆత్మానుభవాన్ని కలిగించే విద్య...! వసుధైక కుటుంబాన్ని స్థాపన చేసే విద్య....! అందరూ కలిసికట్టుగా వుండి ... సర్వ మతాలూ, సర్వ జాతులు, సర్వ కులాలు, సర్వ తెగలు అందరూ ఏకమై, ఒక గొడుగు క్రిందకు వచ్చే, అందరినీ ఒక దగ్గరికి తీసుకొచ్చే విద్య... ఆత్మ విద్య... ధ్యాన విద్య... మైడియర్ ఫ్రెండ్స్...!

ఈ రోజు "ఆధ్యాత్మిక శాస్త్రం" యొక్క రూపురేఖల్ని, సంపూర్ణంగా తెలుసుకుంటున్నాం. ఆత్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం, పురోగమన సిద్ధాంతం, యోగ సిద్ధాంతం....

**"సర్వ ధర్మాన్ పరిత్యజ!"**

"ఈ యొక్క అన్ని ధర్మాలూ వదిలిపెట్టి, నిన్ను నువ్వు తెలుసుకో, నీ శరణమే నువ్వు కోరుకో!"

**"సర్వ ధర్మాన్ పరిత్యజ**

**మామేకం శరణం వ్రజ"**

'మాం అంటే 'తన్ను తాను' అనే కానీ 'కృష్ణుడ'ని కాదు అర్థం! ఫస్ట్ చేయవలసింది... నీ గురించి నువ్వు తెలుసుకోవడం! అందరూ రమణ మహర్షి దగ్గరికెళ్ళేవారు, ఆయన ఎప్పుడూ ఒకటే అనే వారు, "నీ గురించి నువ్వు తెలుసుకోవయ్యా" అని!

"ఆ ... నాపేరు సుబ్బారావండి."

"ప్చ్...! నీ పేరడగలేదు. నిన్ను గురించి నువ్వు తెలుసుకున్నావా...?"

"నేను నెల్లూరు నుండి వచ్చానండి, మాది నెల్లూరండి."

"ఉహూ... సారీ.. నీ గురించి నువ్వు తెలుసుకున్నావా?".... జీవితాంతం "నువ్వు శరీరం కాదు, ఆత్మ" అని ప్రభోధించడానికే ఆయన పుట్టాడు.

మై డియర్ ఫ్రెండ్స్ ! ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క పూర్ణ రూపాన్ని ప్రతి మనిషికీ ప్రసాదించడం కోసమే ఈ భూమండలంలోకి అవతరించారు. పిరమిడ్ మాస్టర్స్!"

కొండ మీద కూర్చునే వాళ్ళు కాదు పిరమిడ్ మాస్టర్స్...! ఇంటింటికీ తిరిగే వాళ్ళు.... పిరమిడ్ మాస్టర్స్! అందరికీ ధ్యాన బోధను చేసి, "నీ ఆత్మను నువ్వు తెలుసుకోవాలి; నీ జన్మను నువ్వు తెలుసుకోవాలి; నీ కర్మను నువ్వు కరిగించుకోవాలి; నీ పురోగమనాన్ని నువ్వు వేగవంతం చేసుకోవాలి; అనేకానేక సిద్ధాంతంలోకి అడుగిడాలి!" అని ప్రబోధించే వాళ్ళే పిరమిడ్ మాస్టర్స్.

**"అనేకానేక సత్యం!"**

ఆరవ సిద్ధాంతం మిత్రులారా... అనేకానేక సిద్ధాంతం!

ఏం తెలుసుకుంటాం మనం ఓ యోగి అయినప్పుడు?..... పరమ యోగి అయినప్పుడు? యోగి అయినప్పుడు ఆత్మ సిద్ధాంతం తెలుసుకుంటాం, పునర్జన్మ సిద్ధాంతం తెలుసుకుంటాం, కర్మ సిద్ధాంతం తెలుసుకుంటాం. పురోగమన సిద్ధాంతం తెలుసుకుంటాం; యోగ్యులమవుతాం,

దుఃఖరాహిత్యం సంపాదించుకుంటాం!

తర్వాత పరమ యోగీశ్వరులమయినప్పుడు "అనేకానేక సిద్ధాంతం" తెలుసుకుంటాం!

ఈ "అనేకానేక సిద్ధాంతం" అన్నది ముఖ్యంగా వర్ధమాన మహావీరుడి ప్రభోధాల్లో విశేషంగా కనబడుతుంది. అసలు ఆ పదాన్ని తీసుకొచ్చిందే ఆయన! "అనేకానేక"... అంటే ఏమిటి?" ఎన్ని లోకాలున్నాయయ్యా సృష్టిలో?" అంటే, "ఓ యబ్బ... కోటానుకోట్ల లోకాలు! సృష్టిలో ఎన్ని గెలాక్సీలో, ఎన్ని సూర్యమండలాలో! ఒక్కొక్క సూర్య మండలంలో ఎన్నెన్ని గ్రహాలో...! లెక్కలేనన్ని... అనంతం!"

## ఇన్ఫినిటీ!

"అనేకానేక" అంటే "అనంతం"... "Infinity"! సృష్టిలో ఎన్ని చిత్ర విచిత్రాలు ఉన్నాయంటే.... అనేకానేక చిత్రవిచిత్రాలు! ఎన్నివున్నాయంటే, ఇన్ఫినిటీ... అనంతం!

"సృష్టిలో ఏయే పనులు చేయొచ్చు?" అంటే ఏదైనా చెయ్యొచ్చు. అనేకానేకాలు! కనుక ఆ యొక్క అనేకానేకతలో అనుక్షణం జీవిస్తారు. యోగీశ్వరులు అనేకానేక సిద్ధాంతం... ఇన్ఫినిటీ! ఎవ్విరీ థింగ్ ఈజ్ ఇన్ఫినిటీ! ఎన్ని లోకాలున్నా ఇన్ఫినిటీనే! ఎంత మందికన్నా నువ్వు మంచి చెయ్యొచ్చు... ఇన్ఫినిటీ! ఎంత పుణ్యమన్నా మూట కట్టుకోవచ్చు ... ఇన్ఫినిటీ! ఎంత పాపాన్నైనా మూటకట్టుకోవచ్చు...ఇన్ఫినిటీ!

ఏదైనా ఎంతైనా చేయవచ్చును. ఎంత మందినైనా ఆత్మ జ్ఞానులుగా చేయవచ్చు... ఇన్ఫినిటీ! ఎంత ఆనందమైనా అనుభవించవచ్చు... ఇన్ఫినిటీ! ఎన్ని క్రొత్త లోకాలు నువ్వు సృష్టించవచ్చు? ఇన్ఫినిటీ!

ఒకసారి దేవతలంతా కలిసి, తమ తమ సూక్ష్మ శరీరాలనుంచి కారణ శరీరాలను విడతీసి శివుడి దగ్గరికి వెళ్ళారట! ఆయన తన మహాకారణ శరీరంతో ధ్యానం చేస్తున్నాడట. వీళ్ళందరూ వెళ్ళి ఆయన ముందు కూర్చున్నారట. కాస్సేపటికి ఆ పరమేశ్వరుడు కళ్ళు తెరిచి, "ఏమిటయ్యా, అందరూ ఇక్కడికి వచ్చారు?" అంటే... "స్వామీ.. మేమెంతో కష్టపడి మా యొక్క సూక్ష్మ శరీరాల్నుంచి కారణ శరీరాల్ని బయటకి తీసి, మీ దగ్గరికి వస్తున్నాం కదా...! మీరే అల్టిమేట్ కదా...! మరి మీరెందుకు ధ్యానం చేస్తున్నారు?" అన్నారట, ఆ దేవతలు! "మీకూ నాకూ ఎంత తేడా వుందో, నాకూ నా పై లోకాలకూ కూడా ఇంకా అంత తేడా ఉంది. నాపైన ఎంతో మంది ఉన్నారు, అనేకానేకాలు...!" అన్నాడు పరమేశ్వరుడు!

## "పునర్జన్మ న విద్యతే!"

ఎప్పుడూ కూడానూ, తాటిని తన్నేవాడి తల తన్నేవాడు మరొకడుం టాడు! ఎప్పుడూ...! పరమయోగీశ్వరులమై, అనేకానేక సిద్ధాంతంలోకి ప్రవేశించినప్పుడు ఎంత ఆనందమో... బ్రహ్మానందం! అప్పుడు నిజంగా మనం "అహం బ్రహ్మాస్మి". ఈ శైశవాత్మ అన్నది సంపూర్ణంగా పూర్ణాత్మ అయిపోతుంది.

**"ఆ బ్రహ్మాభువనాల్లోకా పునరావృత్తి నోర్జున**
**మాముపత్యేయ కౌంతేయ పునర్జన్మ న విద్యతే॥"**

అనేకానేక సిద్ధాంతాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న తర్వాత ఇంక పునర్జన్మ లేదు! కనుక, యోగి కాని వాడు యోగి కావలె! యోగి అయిన వాడు యోగీశ్వరుడు అయి తీరుతాడు; యోగీశ్వరుడు అయిన ప్పుడు పునర్జన్మ లేదు!

ఏసుక్రీస్తు ఓ యోగీశ్వరుడు! వర్ధమాన మహావీరుడు, శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు, వాల్మీకి, గౌతమబుద్ధుడు... వీరంతా యోగీశ్వరులు. మనం కూడా యోగీశ్వరులమవుదాం. కేవలం తినడానికి, పడుకోవడానికి మనం పుట్టామేమిటి? 'ఈ రకం' చొక్కా వేసుకోవాలి... కానీ కేవలం వీటి కోసం పుట్టలేదు. యోగీశ్వరులు కావడం కోసమే మనం అందరం పుట్టాం!

మిత్రులారా...! ఈ రోజు ఆధ్యాత్మికశాస్త్రం యొక్క రూపురేఖలను తెలుసుకున్నాం. ఆరు సిద్ధాంతాలు, ఆరు సత్యాలు, ఆరు అవగాహనలు, ఆరు ప్రతిపాదనలు...!

"మనం శరీరం కాదు ఆత్మ".... ఆత్మ సిద్ధాంతం.

"మనం ఎంతో మంది భార్యలతో ఇంతకు ముందు కూడి ఉన్నాం. ఎంతో మంది భర్తలతో కూడి ఉన్నాం. ఎన్నో ఆడ శరీరాలు ధరించాం. ఇంకెన్నో మగ శరీరాలు ధరించాం. ఎంతో మందికి పుట్టాం. ఎంతో మందిని పుట్టించాం!" ... పునర్జన్మ సిద్ధాంతం.

"రాజుగా పుట్టాం, జమీందారుగా వున్నాం, పేదవాడిగా వున్నాం, కండక్టర్‌గా వున్నాం, కుమ్మరి వాడిగావున్నాం, కమ్మరి వాడిగా వున్నాం, కార్మికుడిగా వున్నాం, రాజకీయ వేత్తగా వున్నాం..., సకల కర్మలూ చేశాం!" కర్మ సిద్ధాంతం!

"ఎప్పుడూ కూడా పురోగమనమే... ప్రతి జన్మ, ప్రతి కర్మ పురో గమనమే" పురోగమన సిద్ధాంతం.

ఇంతకుముందు ఎన్నో జన్మల్లో ధ్యానం చేసే ఇక్కడికి వచ్చాం.

గౌతమ బుద్ధుడు అంతకు ముందు జన్మల్లోనే అరిహంత్, తర్వాత బోధి సత్త్వుడు, ఆ తర్వాత బుద్ధుడు! పిరమిడ్ మాస్టర్లందరూ కూడానూ అంతకు ముందు ఎన్నో జన్మల్నించీ ధ్యానం చేసినవాళ్ళే...! అందుకే పువ్వు పుట్టగానే పరిమళించినట్లు పిరమిడ్ మాస్టర్లు ముట్టుకోగానే బుద్ధుళ్ళవుతున్నారు. గ్రామగ్రామలూ తిరిగి ధ్యాన ప్రచారం, జ్ఞాన బోధ చేస్తున్నారు పిరమిడ్ మాస్టర్లు! చూశారా.. అంటే ఎన్నో జన్మల క్రిందటే ధ్యానులైన వాళ్ళు! ... యోగ సిద్ధాంతం!

యోగ సిద్ధాంతం తరువాత అనేకానేక సిద్ధాంతం...! కనుక మైడియర్ ఫ్రెండ్స్, మై డియర్ మాస్టర్స్, అండ్ మైడియర్ గాడ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్...! ధ్యానంలోకి వచ్చినప్పుడు మొట్టమొదటగా ధ్యాని అయి, యోగి అయి, పరంపరగా ఋషి అయి, రాజర్షి అయి తుదకు బ్రహ్మర్షి అవుతాం!

"యోగి" అయినప్పుడు దుఃఖం నుండి బయటి కొస్తాం!

"ఋషి" అయినప్పుడు దివ్యచక్షువు వుందని తెలుసుకుంటాం!

"రాజర్షి" అయినప్పుడు మన జన్మలన్నీ మనం చూసుకుంటాం!

"బ్రహ్మర్షి" అయినప్పుడు అనేకానేక సిద్ధాంతంలో వసిస్తాం! సృష్టి యొక్క సకల మౌలిక సత్యాలనూ తెలుసుకుంటాం! బ్రహ్మర్షి అయినవాడే ఓ యోగీశ్వరుడు!

యోగి నుండి యోగీశ్వరుడవుతాడు! 'ధ్యాని' ... 'యోగి'... 'ఋషి'... 'రాజర్షి' ... 'బ్రహ్మర్షి'...! చూశారా...!

ధ్యానాభ్యాసం చేసేవాడు... మనస్సు మీద సంపూర్ణ ఆధిపత్యం సంపాదించినప్పుడు ... 'యోగి' అవుతాడు. యోగి అయినవాడు .. అచిరకాలంలో దివ్యచక్షువు సంపాదించుకున్నప్పుడు ... 'ఋషి' అవుతాడు. ఋషి అయినవాడు... తన దివ్యచక్షువతో తన జన్మలన్నీ చూసుకున్నప్పుడు ... 'రాజర్షి' అవుతాడు. రాజర్షి అయినవాడు...తానే సర్వమూ, సర్వమూ తానే అని తెలుసుకున్నప్పుడు... 'బ్రహ్మర్షి' అవుతాడు.

థాంక్యూ వెరీ మచ్....! ఈ రోజు చక్కగా ఆధ్యాత్మిక శాస్త్రం యొక్క ఆరు సిద్ధాంతాలు తెలుసుకున్నాం. ధ్యానం చేద్దాం! యోగి అవుదాం! యోగీశ్వరులమవుదాం!

అందరికీ నమస్కారం...! సకల మానవాళీ ధ్యాన ప్రపంచంలో ప్రవేశించవలె! మానవాళి అంతా కూడానూ ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులు కావలె!!

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుడ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

*- బ్రహ్మర్షి పత్రీజీ*